క్లుప్తంగా

బాల్య మిత్రుడికి ఆర్థికసాయం



మద్దూరు: మండలంలోని జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98వ పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ బాల్య మిత్రుడు సలీం కుటుంబానికి శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. గతకొంత కాలం క్రితం సలీం (పక్షవాతం) అనారోగ్యంతో ఏ పనిచేయలేకపోవడంతో కుటుంబం గడవని పరిస్థితి నెలకొంది. ఆస్పత్రిలో చూయించుకోవడానికి కూడా ఆర్థిక స్థితి బాగలేకపోవడంతో తొటిమిత్రులు రూ. 21వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. ఆపరేషన్‌కు అవసరమైన సహకారం కూడా అందజేస్తామని కుటుంబానికి బరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకట్‌రాములు, నర్సింగ్‌రావు, చందు, పురుషోత్తం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఆసరా పింఛన్లు ఇవ్వాలి

మరికల్: ధనికులకు కాకుండా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఆసరా పథకం పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో అన్నారు. గత ప్రభుత్వం ఈ పథకంలో పేదవారితో పాటు ధనికుల కుటుంబాలకు కూడా పింఛన్లు మంజూరు చేసి ప్రభుత్వ ఖాజనకు గండి కొట్టిందన్నారు. పేదవారితో పాటు అర్హులను గుర్తించి పింఛన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అధికారులు స్పందించాలని కోరారు.

12న తైబజార్ వేలం

మద్దూరు: పట్టణంలోని ప్రతి గురువారం నిర్వహించే సంతబజారు, పశువుల సంత వేలం ఈ నెల 12న గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామునాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మార్చిలో వేయాల్సిన వేలం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. జూన్ నుంచి వచ్చే మార్చి 31వరకు ఈ వేలంలో అత్యధిక పాట పాడిన వారు కొనసాగుతుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ఈ నెల 10న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రూ. వెయ్యి చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. వేలం దక్కించుకున్న వారు గ్రామ పంచాయతీ నిబంధనల మేరకు డబ్బులు చెల్లించాలని ఆయన తెలిపారు.

డీకే అరుణకు మంత్రి పదవి ఇవ్వాలి

నారాయణపేట రూరల్: సీనియర్ రాజకీయ నాయకురాలు, పాలమూరు ఎంపీగా గెలిచిన డీకే అరుణకు కేంద్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని బీజేపీ జిల్లా నాయకులు రఘువీర్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. ముచ్చటగా మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. కొత్త కేబినేట్‌లో తెలంగాణనుంచి మహిళా కోటలో, సీఎం రేవంత్ సొంత జిల్లాలో గెలవడంపై నియోజకవర్గంలో హర్షం వ్యక్తమవుతుందన్నారు. మంత్రి పదవీ ఇస్తే మరింత ఆనందంగా ఉంటుందని కోరారు.

మాజీ సర్పంచ్ మృతి



రామస్వామి (ఫైల్)

మాగనూర్: మండల పరిధిలోని తళంకేరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామస్వామి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన గ్రామానికి చేసిన సేవలను జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ కొనియాడారు. ఆయన అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయాలు నెలకొన్నాయి. ఆయన మృతిపై మండల కేంద్రంలోని ఆయా పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

అసంపూర్తిగానే తరగతి గదులు

- నిర్మాణాలు మధ్యలోనే ఆగిన వైనం
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



పునాది స్థాయిలోనే నిలిచిన మందిపల్లి పాఠశాల



అసంపూర్తిగా ఉన్న మాగనూర్ పాఠశాల

మాగనూర్: మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు అసంపూర్తిగానే ఉన్నాయి. పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో దాదాపుగా మండలంలోని ఐదు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించ తలపెట్టిన అదనపు గదుల నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం పుణ్యమని పనులు కొనసాగించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో అసంపూర్తిగా ఉన్న గదుల్లోనే విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. తరగతి గదిల్లో ఇప్పటి వరకు కరెంట్ సరఫరా చేపట్ట లేదు. తరగతి గదులకు ఎలాంటి రంగులు వేయకుండనే అలానే వదిలేశారు. నిధుల కొరత వలన పనులు చేపట్ట లేదని కాంట్రాక్టర్ చేతులేత్తయడంతో పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం విద్యార్థులకు శాపమైంది. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం కేటాయించిన ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు ఉన్నప్పటికి అదనపు గదుల కొరత తీవ్రంగా ఉంది.

మండలంలో ఇలా..

మండలంలోని మందిపల్లి పాఠశాలలో దాదాపుగా 204మంది విద్యార్థులుండటంతో 2012లో అదనపు గదుల నిర్మాణం కోసం రూ. 879792 మంజూరు కాగా ఇందులో రూ. 1లక్ష మాత్రమే డ్రా చేసుకోగా మిగిలిన రూ.779792 తిరిగి వెళ్లాయి. అయినా పనులు పూర్తి కాకపోవడంతో 200మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా మాగనూర్ ప్రాథమిక పాఠశాలలో 2011లో అదనపు గదుల నిర్మాణం ప్రారంభించిన ఇప్పటి వరకు పూర్తి కాలేదు. అచ్చంపేట ప్రాథమిక పాఠశాల పునాది స్థాయి దాటడం లేదు. ఉజ్జెల్లిలో ఆర్‌అండ్ఆర్ సెంటర్ కారణంగా మరో చోట నిర్మాణం చేపట్టినా అవి కూడా అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయి. దీంతో తరచు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

పట్టించుకోని అధికారులు..



అదనపు గదుల నిర్మాణ పనులు పదేళ్లకు పైగా అలాగే వదిలేసిన, ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయించాలి.

– తిమ్మన్న, హెచ్ఎం మందిపల్లి.

వివరాలు అందజేశాం..



మండల వ్యాప్తంగా ఏళ్ల తరబడి తరగతి గదులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. అయితే ఈ విషయంపై పూర్తి వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– వెంకటయ్య, ఇన్‌చార్జి ఎంఈఓ, మాగనూర్

'గృహజ్యోతి' ప్రారంభం



జీరో బిల్లు తీస్తున్న విద్యుత్ లైన్‌మెన్

మాగనూర్: 200యూనిట్ల ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకం అమల్లోకి రావడంతో తెలంగాణలోని విద్యుత్ పంపిణీ సంస్థలు శుక్రవారం నుంచి అర్హులైన కుటుంబాలకు జీరో బిల్లులు జారీచేయడం ప్రారంభించాయి. మండల వ్యాప్తంగా ఆయా గ్రమాల్లో శనివారం గృహజ్యోతి పథకం ప్రారంభించినట్లు కాంగ్రెస్ నాయకుడు ఆనంద్‌గౌడ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతకు తోడ్పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినహామీ మేరకు గృహజ్యోతి పథకం ప్రారంభించడం చాలా సంతోషకరమని తెలిపారు. అయితే ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఇన్ని రోజులు గృహజ్యోతి అమలు కాలేదని నేటినుంచి వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు సకాలంలో అందించాలి

దామరగిద్ద: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తామని చెప్పిన, సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయడం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబాష్ డిమాండ్ చేశారు. గత యాసంగి సాగుకు చెందిన రైతుబంధు డబ్బులను పూర్తిస్థాయిలో అందించ లేదన్నారు. ఇక ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభమై రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొన్న రైతుబంధు ఊసే లేదన్నారు. పెట్టుబడి సహాయం అందిస్తారో లేదో అన్న ఆందోళనలో రైతులు ఉన్నారని ప్రభత్వం ఇచ్చినహామీ మేరకు రైతుభరోసా పేరుతో రైతుబంధు డబ్బులను పెంచి సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళ చేపడతామని హెచ్చరించారు.

రోడ్డు పక్కన కూరుకుపోయిన లారీ

మక్తల్: మండలంలోని గుడిగండ్లలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డు పక్కన లారీ ఆగి ఉండటంతో కూరుకుపోయింది. దీంతో కొంత సేపురాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శనివారం లారీని బయటకు తీసేందుకు ప్రయత్నం చేసిన రాకపోవడంతో జేసీబీ సాయంతో ముందుకు తీశారు.

కాంగ్రెస్ గెలుపుపై హర్షం

కోయిల్‌కొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్‌మల్లన్న విజయం సాధించడంతో శనివారం మండలకేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షుడు జి.రవీందర్, రామునాయక్, బండి యాదవ్‌కుమార్, మహేందర్‌నాయక్, నాగరాజు, రామస్వామి, మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మల్లయ్యగౌడ్, నరేష్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశం



మక్తల్: మండలంలోని శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశాన్ని గోపాలం అధ్యక్షతన నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. పెన్షనర్లు ఈ నెల 15న తర్వాత పాన్‌కార్డు, ఆధార్‌కార్డుతో లింక్‌చేసుకోవాలని అన్నారు. లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వనివారు ఎస్‌టీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులు మల్లికార్జున్, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, ఆశన్న జన్మదినం సందర్భంగా శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భాస్కర్, గౌరవ అధ్యక్షుడు సంజన్న, మౌలాన, మల్లికార్జున్, సిద్ధిలింగయ్య, నర్సయ్య, సత్యనారాయణ, ఖాదర్ పాష తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికులకు బీమా ప్రతాలు అందజేత



బీమా పత్రాన్ని అందుకుంటున్న కార్మికులు

మరికల్: మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన భారతి సిమెంట్ అవగాహన సదస్సులో భవన నిర్మాణ కార్మికులకు బీమా పత్రాలను ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ శ్రీకాంత్ అందజేశారు. మండలంలోని శనివారం షిర్డీసాయి ట్రేడర్స్ వద్ద ఏర్పాటుచేసిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సాంకేతిక ప్రమాణాలతో కూడుకుందన్నారు. మార్కెట్‌లో మంచి డిమండ్ ఉన్నా భారతి అల్ట్రఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణం వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ఈ సిమెంట్‌తోనే యాద్రాది ఆలయం, ఆలేరు, వరంగల్ జాతీయ రహదారి, బాలనగర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి వాడటం జరిగిందన్నారు. భవన నిర్మాణ పనులు చేసే మేస్త్రీలు ఇలాంటి నాణ్యమైన సిమెంట్‌ను వాడి పనులు పెంచుకోవాలని సూచించారు. అనంతరం 50మేస్త్రీలకు ఉచిత లక్ష రూపాయల ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్, నితిన్, డీలర్ బుచ్చప్ప, మేస్త్రీలు పాల్గొన్నారు.

శ్రీవారి సేవకులు..

- 15 ఏళ్లుగా తిరుపతిలో సేవా కార్యక్రమాలు
- భక్తి గ్రామంగా వెలుగొందుతున్న పల్లెగడ్డ
- ఏడాదికి రెండు టీంలతో సేవలు
- రెండు తెలుగు రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రంలో సేవలు



తిరుమలలో భజన చేస్తున్న పల్లెగడ్డ భజన మండలి సభ్యులు

మరికల్: ''ఏడు కొండల వేంకటేశ్వరుడిని దర్శించుకోవడం ఓ భాగ్యం.. అక్కడ తిరుమలేశుడి సన్నిధిలో సేవా కార్యక్రమాలు చేయడం ఓ మహాభాగ్యం. రెండు టీంలుగా ఏర్పడిన భక్తులు ఏడాదిలో రెండు పర్యాయాలుగా ప్రతి ఆరు నెలలకోసారి తిరుమల, తిరుపతి దేవస్థానంలో సేవ కార్యక్రమాలు నిర్వర్తించడమే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లోని విజయవాడ కనకదుర్గా అమ్మవారు, అన్నవరం, యాదగిరిగుట్ట, శ్రీశైలం, మంత్రాలయంలో సేవలు చేయడంతో పల్లెగడ్డ ఓ భక్తి గ్రామంగా వెలుగొందుతుంది.''

మరికల్ మండలం పల్లెగడ్డలో ఒకే కులానికి చెందిన గ్రామస్తులు ఇక్కడ నివాసముంటున్నారు. ఈ గ్రామంలో మొదటి నుంచి తిరుమల, తిరుపతి వేంకటేశ్వరుడు అంటే వీరికి భక్తిభవం ఎక్కువ అనే చేప్పుకోవాలి. 15సంవత్సరాల నుంచి వీరు తిరుమలేశుడి సన్నిధిలో సేవలు చేస్తు వస్తున్నారు. తిరుపతిలో పలు సేవ కార్యక్రమంలో పాల్గొనేందుకు రెండు భజన మండలి టీంలను ఎంపిక చేశారు. ఒకటి సీతరామంజనేయ భజన మండలి, రెండోది శివపార్వతుల భజన మండలి బృందాలు ఉన్నాయి. వీరిలో ప్రతి ఆరు నెలలకోసారి చొప్పున ఒక టీం తిరుపతికి వెళ్లి వివిధ రకాల సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం 15సంవత్సరాల నుంచి అనావాయితీగా వస్తోంది.

తిరుపతిలో చేసే సేవలు..

అఖండ హరినామ సంకీర్తన భజన కార్యక్రమాలు, గోవింద రాజుల, అలివేలు మంగమ్మ, కోదండరామస్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామి, గోషాశాలలో, అన్నదానశాలలో, కొబ్బరికాయల క్యాంటిన్‌లో పలు రకాల సేవలు ఇక్కడ మూడు రోజుల పాటు చేయాల్సి ఉంటుంది.

తిరుమలలో చేసే సేవలు..

వెంగమాంబ, అన్నదానసత్రం, లడ్డు కౌంటర్‌లో, కల్యాణకట్టలో, వైకుంఠం (రెండో క్యూలైన్)లో భక్తుల సౌకర్యార్థం కోసం సేవలు చేయాల్సి ఉంటుంది. దీంతోపాటు నారాయణసేవ, శ్రీవారిసేవ, వెంకటాద్రిసేవ కార్యక్రమాల్లో పాల్గొని నాలుగురోజులపాటు సేవలు అందిస్తారు.



స్వర్ణగిరిలో శ్రీవారి పాదల వద్ద సేవ బృందం


ఉచిత రైలు ప్రయాణం..

తిరుమల, తిరుపతి దేవస్థానంలో ఏడురోజుల పాటు నిర్వహించే వివిధ రకాలసేవ కార్యక్రమాల్లో పాల్గొనడం కోసం భజన మండలి బృందాలకు టీటీడీ ఉచిత రైలు ప్రయాణ సౌకర్యం కల్పించింది. పురుషులతోపాటు మహిళలు కూడా తిరుపతికి వెళ్లి సేవ కార్యక్రమాలు పాల్గొనడం జరుగుతుంది. సేవా కార్యక్రమాలు ముగిసిన తర్వాత ఏడుకొండల వెంకటేశ్వరుడి దర్శనం చేసుకున్న తర్వాత స్వగ్రామానికి బయలుదేరుతారు.

మిగతా పుణ్యక్షేత్రంలో..

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విజయవాడ కనకదుర్గా, అన్నవరం, యాదగిరిగుట్ట, శ్రీశైలం, మంత్రాలయంతో పాటు తదితర పుణ్యక్షేత్రంలో టీటీడీ భజన మండలి తరపున అక్కడ వచ్చిపోయే భక్తులకు సేవలు చేయడమే కాకుండా తిరుపతి తరహాలోనే మిగితా సేవలు చేస్తు హిందూధర్మం సంస్కృతి, సంప్రదాయలను కొనసాగిస్తు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఇది మా పూర్వ జన్మపుణ్యం..



తిరుమల, తిరుపతి దేవస్థానంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నా పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తులకు సేవ చేయడం మా పూర్వ జన్మ పుణ్యం. తమ గ్రామం నుంచి తిరుపతికి రెండు పర్యాయలుగా భజన కార్యక్రమాలు, నాలుగు పర్యాయలుగా సేవ కార్యక్రమాలను నిర్వహించేందుకు టీంలుగా వెళ్తుంటాం. 15ఏళ్ల నుంచి రెండు సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

– శ్రీరాములు, టీటీడీ ధర్మచార్య, పల్లెగడ్డ

బడీడు పిల్లలు బడిలో ఉండాలి..



మాగనూర్‌లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



పులిమామిడిలో

మాగనూర్: బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని మందిపల్లి ప్రాథమికొన్నత పాఠశాల హెచ్ఎం తిమ్మప్ప అన్నారు. శనివారం మందపల్లితోపాటు ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాటలో పాల్గొన్నారు. ఈ మేరకు.. వారు ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అన్నిరకాల మౌలిక వసతులు ఏర్పాటైనందున పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి, నిడుగుర్తి గ్రామాల్లో శనివారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయ బృందం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్నభోజనం, ఉచిత దుస్తువులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన అందించడం జరుగుతుందని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మారెడ్డి, నరహరి, ఉపాధ్యాయులు పద్మ, సుజాత, సునిత, నర్సింహులు, వెంకటప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం



యువకుడిని సన్మానిస్తున్న నాయకులు

మరికల్: మండలంలోని చిన్నపొర్లకు చెందిన బోయ నవీన్ కుమార్ అగ్నివీర్‌లో ఉద్యోగం సాధించడంతో శనివారం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు లక్ష్మణ్, నర్సింహులు మాట్లాడుతూ నవీన్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకొని తమ పిల్లలను దేశసేవ కోసం పంపించాలని కోరారు. అగ్నివీర్‌లో చేరేందుకు ముందుగా తీసుకునే అర్హత శిక్షణకు పేదవిద్యార్థులు ఉంటే వాల్మీకి సంఘం నుంచి ఆర్థిక సాయం చేసేందుకు ముందుంటామన్నారు. కార్యక్రమంలో కుర్మయ్య, రాములు, నర్సింహులు, వెంకటయ్య, బాలప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ఊట్కూరు: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సంఘం నాయకులు శంకర్ కోరారు. శనివారం నిడుగుర్తిలో రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సదస్సుకు మండలం నుంచి కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శంకర్, అశోక్, కతలప్ప, పద్మమ్మ, ఆశమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిడుగుర్తిలో కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

రామోజీరావు మృతి తీరని లోటు



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట: భారతీయ కళలకు జీవంపోసేందుకు భారత దేశంలోనే అతిపెద్ద రామోజీ ఫిలిం సిటీని హైదరాబాద్‌లో నెలకొల్పి తెలుగోడి ఘన కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహా నీయుడు రామోజీరావు అని టీడీపీ నాయకులు ఓం ప్రకాష్ ముదిరాజ్, ఎస్పీ బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం సత్యనారాయణ చౌరస్తాలో ఎస్పీ బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపాల్ యాదవ్, యాబన్న చౌదరి, భీమన్న భోజప్ప రమేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 2008–09 సంత్సరం పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఉపాధ్యాయులు గుండయ్య, వెంకటప్పలను శాలువాతో ఘనంగా సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులతో తరగతి విద్యార్థులతో గల అనుబంధాలను చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా మిగిలిన గదులు

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన గదుల కూల్చివేత అసంతృప్తిగా జరిగింది. పూర్తిగా శిథిలావస్థకు చేరిన రెండు గదులను కూల్చివేతకు కలెక్టర్ నిధులు మంజూరు చేసిన వెంటనే పనులు జరిగిపోయాయి. పది రోజుల క్రితం మనఊరు –మన బడి భవనం పరిశీలనకు వచ్చిన కలెక్టర్ అసంపూర్తిగా మిగిలిన మరో రెండు గదులను కూడా కూల్చివేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాని కార్యరూపం దాల్చడం లేదు. ఈ రెండు గదులు కూల్చివేస్తే క్రీడామైదానం ఏర్పడే అవకాశం ఉంది. ఈ విషయంపై అధికారులు దృష్టిసారించి అసంపూర్తిగా మిగిలిపోయిన గదుల కూల్చివేతకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, క్రీడాకారులు కోరుతున్నారు.



పూరి సురేష్‌కు సన్మానం

ఆత్మకూర్: తమిళనాడు ఆసియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన ఆర్యవైశ్య సంఘం జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్‌ను శనివారం ఆత్మకూర్‌లో ఆర్యవైశ్యులు సత్కరించారు. కరోనా కాలంలో విశిష్టమైన సేవలు అందించడంతో పాటు నిత్యం ప్రజాసేవలో ముందుండే పూరి సురేష్‌కు డాక్టరేట్ రావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు నర్సింహయ్యశెట్టి, శివరాజు, గణేష్, పరమేష్ ఉన్నారు.